
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి జిల్లా వార్తలు

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



గవర్నర్ ప్రైజ్ అందుకుంటున్న ప్రభాత్ రెడ్డి



ఐఐటీ స్నాతకోత్సవంలో డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు పట్టాలందజేస్తున్న ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ సజ్జన్ జిందాల్

అద్వితీయ విద్యాసంస్థ

తిరుపతి ఐఐటీ

● స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్





ఐఐటీ స్నాతకోత్సవంలో వర్చువల్ పద్ధతిలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రసంగం

ఏర్పేడు, ఫిబ్రవరి 22 : ఓవైపు శ్రీవెంకటేశ్వర స్వామి, మరోవైపు శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఆశీస్సులు పొందుతున్న తిరుపతి ఐఐటీ దేశంలోని మిగిలిన ఉన్నత విద్యా సంస్థలతో పోలిస్తే అద్వితీయ విద్యా సంస్థ అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కొనియాడారు. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో వున్న తిరుపతి ఐఐటీ 4వ మరియు 5వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఢిల్లీ నుంచీ వర్చువల్ విధానంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ విద్యార్థులకు నాణ్యమైన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు ఐఐటీలే నిదర్శనమన్నారు. ఆరోగ్యకరంగా ఎదిగే ప్రక్రియలో తిరుపతి ఐఐటీ నిస్సందేహంగా ఒక ప్రధాన లబ్ధిదారని మంత్రి అభివర్ణించారు. స్వల్ప వ్యవధిలోనే తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ సాధించిందని, అలాగే ఐఐటీ నవవిష్కార్, ఐ హబ్ ఫౌండేషన్ వంటివి ఏర్పాటు చేయడంలో చొరవ చూపిందని ప్రశంసించారు. తిరుపతి ఐఐటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధానంగా స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఈవీ టెక్నాలజీస్ వంటి అంశాలపై దృష్టి సారించిందని, దేశంలోని పట్టణ రవాణా రంగంలో పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో తిరుపతి ఐఐటీకి చెందిన ఈ విభాగాలు గేమ్ ఛేంజర్ కాబోతున్నాయన్నారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ టెక్నాలజీస్, ప్రిసెషన్ అగ్రికల్చర్ రంగాల్లో తిరుపతి ఐఐటీ దృష్టి సారించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటీ బాలికలు ఎంచుకుంటున్న ప్రధాన గమ్యస్థానంగా మారడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ఇతర ఐఐటీల కంటే ఇక్కడే ఎక్కువ సంఖ్యలో బాలికలు చదువుకుంటున్నారని, ఇది నారీ శక్తికి నిదర్శనమన్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ అనేది తమ ప్రభుత్వ నిర్ణయమని, లోక్‌సభలోనూ, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మూడొంతుల సీట్లు మహిళలకు రిజర్వు చేయడం అందులో భాగమేనన్నారు. నిర్ణయాత్మక శక్తిగా మహిళలను అభివృద్ధి పరచడమే దాని ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంచే దిశగా ఐఐటీల నుంచీ వెలుపలికి వచ్చిన విద్యార్థినులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా పట్టభద్రులవుతున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి విద్యార్థుల ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, మరియు జిందాల్ స్టీల్ వర్క్స్ సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రపంచస్థాయికి ఎదగాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ పనుల ప్రారంభంలో ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని గుర్తు చేసుకున్నారు.విద్యార్థులకు సరిపడే కళాశాల భవనాలు, హాస్టల్ భవనాలు, లేబరేటరీలు, క్యాంటీన్లు, మీటింగ్ హాళ్లు, తరగతిగదులతో ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం కళాశాలలో ఉందన్నారు.వీఆర్వో చమన్ మెహతా, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందంగా ఉంది

బీటెక్ ప్రోగ్రాంలో బెస్ట్ అకడమిక్ పెర్మార్మెన్స్ అవార్డు అయిన ప్రెసిడెంట్ మెడల్‌ను అమ్మానాన్నల సమక్షంలో అందుకోవడం ఆనందంగా ఉంది.ఐఐటీలో చేరిన మొదట్లో ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుతో చాలా ఇబ్బంది పడ్డా.మెల్లిగా తిరుపతి వాతావరణానికి అలవాటు పడి చదువుకున్నా.

- సౌమిత్రో వ్యాపారి, ప్రెసిడెంట్ మెడల్ విన్నర్



నా కష్టానికి ఫలితం

పట్టుదల,కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనే మాటను నిజం చేయడానికి చాలా కష్టపడ్డా.పట్టుదలతో చదువుకుని గవర్నర్ ప్రైజ్‌కు ఎంపికయ్యా. స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రైజ్‌ను ఇంతమంది ప్రముఖుల సమక్షంలో అందుకోవడం సంతృప్తినిచ్చింది.

- ప్రభాత్ రెడ్డి లంకిరెడ్డి, గవర్నర్ ప్రైజ్ విన్నర్

575 మందికి పట్టాల ప్రదానం

స్నాతకోత్సవాలను పురస్కరించుకుని క్యాంపస్‌లో మొత్తం 575మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి సజ్జన్ జిందాల్ ఈ పట్టాలను అందజేశారు. బీటెక్ పూర్తి చేసిన 355 విద్యార్థులకు, ఎంటెక్ పూర్తి చేసిన 106 మంది విద్యార్థులకు, ఎమ్మెస్సీ ముగించిన 74 మందికి, ఎంఎస్ పూర్తి చేసిన 17 మందికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన 21 మందికి, డ్యూయల్ డిగ్రీ చేసిన ఇద్దరికి చొప్పున మొత్తం 575 మందికి పట్టాలు అందజేశారు. 2021-22 బ్యాచ్ 4వ స్నాతకోత్సవానికి సంబంధించిన మొత్తం బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సౌమిత్రో వ్యాపారికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, లంకిరెడ్డి ప్రభాత్‌రెడ్డికి గవర్నర్ ప్రైజ్ లభించాయి. అలాగే 2022-23 బ్యాచ్ 5వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ చాటిన దేబాషీ దాస్ అనే విద్యార్థిని ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, నోబుల్ సాజి మాథ్యూస్‌కు గవర్నర్ ప్రైజ్ లభించాయి.



దామలచెరువు హైస్కూల్ వద్ద భువనేశ్వరికి గజమాలతో స్వాగతం పలుకుతున్న చంద్రగిరి నియోజకవర్గ నేతలు, శ్రేణులు

టీడీపీ శ్రేణులపై వైసీపీ చిత్రహింసలు

మరిచిపోలేం

● రాష్ట్రాభివృద్ధికి కార్యకర్తలంతా కష్టపడాలి

● కొత్త ఓటర్లూ, మీ భవితను దృష్టిలో పెట్టుకుని ఓటేయండి ● నారా భువనేశ్వరి పిలుపు

● మూడో రోజు ఐదు కుటుంబాలకు పరామర్శ

కల్లూరు/ఐరాల/బంగారుపాళ్యం/చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 22: 'తెలుగుదేశం పార్టీ వారిని చిత్రహింసలకు గురిచేయడం.. అక్రమ కేసులు పెట్టడం.. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడం. ఇదే వైసీపీ ప్రభుత్వం పని. వీటిని మరచిపోలేం. టీడీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకునే వారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ అరాచకాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఇది సిగ్గుచేటు' అని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన గురువారం ఆమె పులిచెర్ల, ఐరాల, బంగారుపాళ్యం మండలాలతో పాటు చిత్తూరు నగరంలో పర్యటించారు. ఐదు కుటుంబాలను పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలోనే పుంగనూరు నియోజకవర్గంలో చల్లా బాబుతో పాటు వందలాది మంది అక్రమకేసుల్లో జైలులో ఉంటూ ఇబ్బందులు పడ్డారనే విషయం మరిచిపోలేమన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ప్రస్తుతం మహిళలు కూడా ధైర్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర భవిత కోసం పార్టీ కార్యకర్త, నాయకుడు చేయిచేయి కలిపి పార్టీని ముందుకు తీసుకెళ్లి చంద్రబాబును గెలిపించాలని కోరారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత.. రాష్ట్ర, మీ భవిష్యత్తును గుర్తుంచుకుని ఓటేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ వారి దౌర్జన్యాలు, అక్రమాలకు దీటుగా జవాబు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఎన్నోత్యాగాలు చేసి, అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేసుకున్నారు. జగన్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని, యువతకు ఉద్యోగులు, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఈ అరాచక ప్రభుత్వంపై రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో కార్యకర్తలు సైఅంటే సై అనేలా పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు.

కమ్మపల్లెపై కక్ష కట్టిన మంత్రి పెద్దిరెడ్డి

పులిచెర్ల మండలం కమ్మపల్లెవాసులు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రామంపై కక్ష కట్టారని భువనేశ్వరికి విన్నవించారు. జనాభా ఉన్నా కమ్మపల్లెలోని పాఠశాలను రద్దుచేయించి బయట అడవిలో కట్టారన్నారు. కమ్మపల్లెకి మంజూరైన వాటర్‌ట్యాంకు ఊరి బయట కట్టారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి ఎంత ప్రయత్నించినా తాము వైసీపీలోకి వెళ్లకపోవడంతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు మద్దతుదారులుగా ఉంటామని, టీడీపీ అంటే తమకు ప్రాణమన్నారు. పగడాలవారిపల్లెలో టీడీపీ జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ పునర్విభజనకు ముందు పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉండేదని, నారావారిపల్లె ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ప్రజలు ప్రతి ఎన్నికలో టీడీపీకి మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి టీడీపీ వారిని హింసిస్తుండగా మధుసూదన్‌రెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కొన్ని విషయాల్లో సహాయం చేశారని గ్రామస్తులు తెలిపారు.

నేటి పర్యటన ఇలా..

శుక్రవారం ఉదయం 10.45 గంటలకు చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరలో.. 11.45 గంటలకు ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కర్ణం ఆంజనేయులు నాయుడు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు. 1.15 గంటలకు తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి.. 3.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు పయనమవుతారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

పర్యటన సాగిందిలా..

● పుంగనూరు నుంచి బయలుదేరిన ఆమె.. పులిచెర్ల మండలం కమ్మపల్లెలో వెంకటపతి నాయుడు, పడగలవారిపల్లెలో దొరస్వామి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి వెంట ఉన్నారు.

● ఐరాల మండలం చింతగుంపలపల్లెలో జయప్రకాష్, బంగారుపాళ్యం మండలం టేకుమందలో గోవిందయ్య కుటుంబాలను ఓదార్చారు. వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించారు. ఆమె వెంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీమోహన్ ఉన్నారు. చిత్తూరు నగరం కోకలూరులో గురువారం రాత్రి చెరుకూరు సుజాతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బ్యాన్స్ హోటల్‌లో బస చేశారు. ఆయా కుటుంబాలను పరామర్శించిన అన్నిచోట్లా ఆమెను చూసేందుకు, సంఘీభావం పలికేందుకు వచ్చిన కార్యకర్తలను, మహిళలను చూసి భువనేశ్వరి మాట్లాడారు. మార్గమధ్యంలో వేచిఉండేవారిని చూసి కారు ఆపి పలకరిస్తూ వెళ్లారు.

టార్గెట్ బలిజ ఓటర్లు !

● ఆధార్ కార్డుల సేకరణ పనిలో వైసీపీ ● 'మెప్మా' పేరిట డ్వాక్రా మహిళలకు ఎర

● కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు



కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అధికార పార్టీ బలిజ ఓటర్లను టార్గెట్ చేసింది. ప్రలోభాలు, బెదిరింపులు, బుజ్జగింపులతో ఇప్పటికే పలువురు కాపులను తమ వైపు తిప్పుకుంటూ వస్తున్నారు.తృతీయ శ్రేణి నాయకులకు బలవంతంగా కండువాలు వేస్తున్నారు కానీ బలిజ ఓట్లపై పెట్టుకున్న ఆశలు మాత్రం వైసీపీ నేతల్లో సన్నగిల్లిపోతున్నాయి.దీంతో సాధారణ ఓటర్లను మభ్యపెట్టే పనిలో పడ్డారు. మెప్మా పేరుచెప్పి డ్వాక్రా గ్రూపుల్లో బలిజ మహిళల ఆధార్ కార్డులు సేకరించే పని మొదలుపెట్టారు. పొదుపుసంఘాల్లోని బలిజ ఓటర్ల జాబితా కావాలని ఆర్పీల ద్వారా వాట్సప్ గ్రూపుల్లో వాయిస్ మెసేజ్‌లు పెట్టి సేకరిస్తున్నారు.నగరంలోని పొదుపు సమాఖ్యల్లో దాదాపు 160మంది ఆర్పీలుంటే అందులో 40మంది వరకు బలిజ సామాజికవర్గ మహిళలు ఉన్నారు. వీరి ద్వారా సంఘాల్లో ఉండే మహిళల జాబితాను సేకరించి వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డితో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. అలివిగాని హామీలు ఇచ్చేసి బలిజ సామాజికవర్గ మహిళల దగ్గర ఓటు వేసేలా ఒట్టుపెట్టుకునే హామీలు తీసుకోనున్నట్టు ప్రచారం జరుగుతోంది.ఈ విషయంపై ఆధారాలతో టీడీపీ నేతలు గురువారం కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సంబంధిత అధికారులను ఆరా తీశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దుమ్మురేపిన గొడవలో పుణేవాసి మృత్యువాత

తిరుపతి, మహారాష్ట్రవాసుల నడుమ దాబాలో ఘర్షణ ఫలితం



రిషంత్ జగపత్ మృతదేహం

రేణిగుంట, ఫిబ్రవరి 22 : దాబా హోటల్‌లో తిరుపతి, మహారాష్ట్ర వాసులకు నడుమ జరిగిన ఘర్షణలో పుణేకి చెందిన ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... మహారాష్ట్రలోని పుణే, పరిసర ప్రాంతాలకు చెందిన 11 మంది స్నేహితులు బృందంగా ఏర్పడి శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి వెళుతూ మార్గమధ్యం లోని రేణిగుంట మండలం గుత్తివారిపల్లి - మల్లవరం మధ్య రోడ్డుపక్కనున్న సంతోష్ పంజాబీ దాబా హోటల్ వద్ద ఆగారు. కొంతసేపటికి తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన ఆరుగురు మద్యం సేవించి అతివేగంగా వాహనంలో దాబా దగ్గరకు చేరుకున్నారు.ఆ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి సడన్ బ్రేక్ వేసి ఆపడంతో పెద్దఎత్తున దుమ్ము రేగింది. అదే హోటల్‌లో మహారాష్ట్రకు చెందిన వారు కూర్చుని భోంచేస్తుండగా దుమ్ము వారి ప్లేట్లలో పడింది.దీంతో ఆగ్రహించిన మహారాష్ట్రవాసులు ఇంత వేగమెందుకని ప్రశ్నించారు.ఒకరు లేచి కారు అద్దాలను కొట్టారు.దీంతో తిరుపతివాసులు గొడవకు దిగడంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది.పుణేకి చెందిన రిషంత్ జగపత్ (45), కుల్దీప్ (45) తీవ్రంగా గాయపడ్డారు.ఘటనా స్థలంలో వున్న వారిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఆ ఇద్దరినీ తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో చికిత్స పొందుతూ రిషంత్ జగపత్ మృతి చెందాడు. మృతుడి స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతికి చెందిన ఆరుగురిలో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. రిషంత్ జగపత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సంబంధీకులకు మృతదేహాన్ని అప్పగించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లకు రూ.2 కోట్లు కావాలి

● హౌసింగ్ నిధుల్ని అత్యవసరంగా మళ్లించండి

● ఎండీకి లేఖ రాసిన చిత్తూరు కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల కోసం రూ.2 కోట్ల నిధుల్ని మళ్లించమని హౌసింగ్ శాఖ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్‌కు కలెక్టర్ షన్మోహన్ లేఖ రాశారు. వివరాల్లోకి వెళితే.. రామకుప్పంలో హంద్రీనీవా నీళ్లను వదిలి, బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ పర్యటన ఇప్పటికే పలు మార్లు వాయిదా పడింది. ఫైనల్‌గా ఆయన సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసేందుకు రూ.2 కోట్ల వరకు ఖర్చు కానుంది. సాధారణంగా కలెక్టర్ ఖాతాల్లో కనీసం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నిధులు ఉంటాయి. టీడీపీ హయాంలో పనిచేసిన సిద్ధార్థజైన్, ప్రద్యుమ్న ఖాతాల్లో రూ.కోట్లలో నిధులు నిత్యం ఉండేవి. వాటితో కలెక్టర్లు తమ విచక్షణతో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో పనిచేసిన ఏ కలెక్టర్ ఖాతాలోనూ రూ.10 లక్షలకు మించి ఉండడం లేదు. ఇదిలా ఉండగా, జిల్లాల్లో సీఎం జగన్ పర్యటన ఉన్నప్పుడు ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధుల్ని మంజూరు చేస్తుంది. ఈసారి ప్రత్యేక నిధులు జిల్లాకు రాలేదని తెలిసింది. ఈ క్రమంలో ఏర్పాట్ల కోసం రూ.2 కోట్లను అత్యవసరంగా కేటాయించాలని కలెక్టర్ హౌసింగ్ ఎండీకి గురువారం లేఖ రాశారు. ప్రస్తుతం ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బిల్లుల నిధులు హౌసింగ్ శాఖ అందుబాటులో ఉన్నాయి.

వేడుకగా కల్యాణ వెంకన్న ఆలయ శుద్ధి


ధ్వజ స్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు, అర్చకులు

చంద్రగిరి, ఫిబ్రవరి22: వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కూర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచీలిగడ్డ, తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 29న ఉదయం ధ్వజారోహణం జరగనుంది. అదేరోజు రాత్రి పెద్దశేష వాహనంతో వాహన సేవలు మొదలు కానున్నాయి. కాగా తిరుపతికి చెందిన మణి రెండు పరదాలు, రెండు కురాళాలు ఆలయానికి విరాళంగా అందించారు. బ్రహ్మోత్సవాలలో వీటిని వినియోగించనున్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు పాల్గొన్నారు.

చంద్రగిరి స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



చంద్రగిరి, ఫిబ్రవరి 22: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేసి, వారికి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనదే అని తిరుపతి ఎస్పీ మలిక గర్గ్ అన్నారు. గురువారం సాయంత్రం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం చాలా సున్నితమైన ప్రాంతమని, సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా పాత నేరస్థులను బైండోవర్ చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచాలన్నారు. భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ అమలు చేయాలన్నారు. చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారి వెంబడి డాబాలు, హోటళ్ల వద్ద వాహనాలు నిలపకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో గ్రూప్ తగాదాలు జరగకుండా తక్షణ పరిష్కారం చూపాలన్నారు. గాదంకి, ఎ.రంగంపేటల వద్ద చెక్‌పోస్టులు వద వాహనాలు తనిఖీలు నిర్వహించి, ఎర్రచందనం, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాను అరికడుతూ నిరంతరం నిఘా పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, సీఐ రామయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురిక్కాలువ నిర్మాణానికి భూమిపూజ

చంద్రగిరి, ఫిబ్రవరి 22: చంద్రగిరి మండలం రాయలపురం పంచాయతీ వెంకటంపేటలో మురుగు కాలువ నిర్మాణానికి గురువారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి భూమిపూజ చేశారు.

దామలచెరువులో నారా భువనేశ్వరికి ఘన స్వాగతం



పాకాల, ఫిబ్రవరి 22: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి దామలచెరువులో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఈ మార్గంలో వెళ్తున్న ఆమెకు దామలచెరువు హైస్కూల్ గేటు కూడలిలో గజమాల వేసి సత్కరించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపం చెంది ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.అందరూ చేయిచేయి కలిపి తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ పి.అనురాధ, చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని, సుధారెడ్డి, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ


పాకాల, ఫిబ్రవరి 22:పాకాల సమీపంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పాలినేనివారిపల్లెలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పి.అహ్మద్ విధి నిర్వహణలో భాగంగా తిరుపతికి వెళ్లారు. కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళుతూ ఇంటికి తాళం వేసి వెళ్లారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో వున్న 32 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.60వేల నగదు చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని గురువారం ఉదయం పాకాల పోలీసులు సందర్శించారు, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి


భాగ్యమ్మ (ఫైల్‌ఫొటో)

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 22 : విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కుండ్ల భాగ్యమ్మ (76) మృతిచెందారు.నెరబైలు పంచాయతీకి చెందిన భాగ్యమ్మ భర్త కూడా నాగరాజ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగవిరమణ పొందారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాగ్యమ్మను కుటుంబ సభ్యులు నాలుగు రోజుల కిందట తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.సరైన రవాణా సదుపాయాలులేని రోజుల్లో ఉపాధ్యాయులైన భాగ్యమ్మ, నాగరాజ మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యాబోధనతోపాటు రాత్రి పూట బడులు, అక్షర తపస్మాన్ కార్యక్రమం కింద పేద వర్గాలో అక్షరాస్యత పెంపునకు ఎంతగానో కృషి చేశారు. దీంతో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతోపాటు, జిల్లాస్థాయి అవార్డులు,ప్రశంసలు ఎన్నో అందుకున్నారు. భాగ్యమ్మ అంత్యక్రియలు శనివారం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేపచెట్టుతో రాగిచెట్టుకు పెళ్లి



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 22: వేదాంతపురంలోని సత్యమ్మ ఆలయం వద్ద వేప చెట్టు, రాగి చెట్టుకు పెళ్లి చేశారు. లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు ముత్యాలయ్య, పద్మావతమ్మ దంపతులు తెలియజేశారు. 18 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. వర్షాలు సకాలంలో కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. రావిచెట్టును శివుడిగా, వేపచెట్టును పార్వతిగా భావించి పట్టు బట్టలతో అలంకరించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నేతలు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండే చెంగారెడ్డి, మునిరామయ్య, తొండమనాటి సుబ్రమణ్యం, శివ మునెమ్మ, వెంకటముని, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించండి : మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 22: తిరుపతి రూరల్ మండలంలోని చెర్లోపల్లె, పుదిపట్ల, పేరూరు, లింగేశ్వరనగర్ పంచాయతీల్లో గురువారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పర్యటించారు. తనకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

27న మందకృష్ణ రాక

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 22: ఈ నెల 27వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తిరుపతికి రానున్నారు. అన్నమయ్య సర్కిల్ సమీపంలో గల జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణపై నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఇందులో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తిరుపతి జిల్లా కో- ఇన్‌చార్జి గోపీ మాదిగ కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మహాశివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

తిరుచానూరు, ఫిబ్రవరి 22: తిరుచానూరు యోగిమల్లవరంలో కొలువుదీరిన కామాక్షాంబసమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. గురువారం ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డిని తుమ్మలగుంటలోని ఆయన నివాసం వద్ద కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో మమత, ప్రధాన అర్చకులు మూర్తి గురుకుల్, పాలకమండలి సభ్యులు తిరుపాల్‌రెడ్డి, వాసు, వార్డు మెంబరు లోకేశ్వర్‌రెడ్డి, డివిజనల్ అధ్యక్షులు సూర్య, శరవణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అండతో కేసు నీరుగారుస్తారా?

● మీడియాపై దాడుల కేసుల్లో పోలీసుల తీరుపై టీడీపీ మండిపాటు



తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడులు చేసిన వ్యక్తులు తగిన మూల్యం చెల్లించుకున్న ఘటనలు చరిత్రలో అనేకం ఉన్నాయని, వైసీపీ రౌడీ మూకలకు, వారిని నడిపిస్తున్న జగన్ రెడ్డికి కూడా ఇదే పరిస్థితి దగ్గర పడిందని తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం టీడీపీ నాయకులు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీ తీరును పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై ఎవరెవరు దాడిచేశారో ఆధారాలతో పత్రికల్లో ఫొటోలు వచ్చినప్పటికీ పోలీసులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ అండదండలతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.టీడీపీ నాయకులు పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, బుల్లెట్ రమణ, కొట్టే హేమంత్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, రుద్రకోటి సదాశివం, కరాటే చంద్ర, ఆముదాల తులసీరామ్, అనిత,హేమ, రేవతి,మునిరామయ్య, రాజయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై దాడి కేసులో అరెస్టు చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండు చేశారు.మీడియాపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్దవున్న గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం ఎర్రజెండాలను ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కస్టడీకి తీసుకున్న 15మంది నిందితులపై వెంటనే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగరకార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నేత ఎస్.డి.రవి మాట్లాడుతూ జర్నలిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలే కూలిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. అధికార పార్టీకి వత్తాసుగా పనిచేసిన అధికారుల ప్రస్తుత పరిస్థితిని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు.చంద్రశేఖర్, శ్రీరాములు, శివ, రాజా, మణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన బ్యాడ్జీలతో ఇక మీడియా కవరేజి

● తిరుపతి జర్నలిస్టుల నిర్ణయం



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 22:జర్నలిస్టులపై రాష్ట్రంలో జరుగుతున్న వరుస దాడులపై ఆగ్రహించిన తిరుపతి జర్నలిస్టులు ఇక నుంచి నిరసన బ్యాడ్జీలు ధరించి వైసీపీ సహా అన్ని కార్యక్రమాలను కవర్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బ్యాడ్జీలను ఆవిష్కరించారు. ఏపీయూడబ్ల్యూజే, తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాశవిక దాడులను ప్రజల్లోకి తీసుకువెళ్లి అన్నివర్గాల నుంచీ మద్దతు పొందేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని నిర్ణయించుకున్నా రు. నాలుగో స్తంభాన్ని కాపాడుకోవడానికి రచయితలు, కళాకారులు, పౌరహక్కులు, ఇతర ప్రజాసంఘాల నేతలు సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. మేధావివర్గం భయం, మౌనం వదిలి మాట్లాడకపోతే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు.ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర, తిరుపతి ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్ , కార్యవర్గ సభ్యులు కుమార్, రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగల అరెస్ట్

● రూ.12.50 లక్షల విలువైన 16 బైక్‌ల స్వాధీనం


అరెస్ట్ చేసిన దొంగలు, స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22: జిల్లాలో మోటారు సైకిళ్ల దొంగతనాలు చేస్తున్న ఐదుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా క్రైం అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపిన వివరాల ప్రకారం... చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లికి చెందిన రవికుమార్ కుమారుడు కాకాని సాత్విక్ అలియాస్ గోకుల్ (19), ఎర్రావారిపాళెం మండలం, కన్నేవారిపల్లెకు చెందిన షేక్ మస్తాన్ కుమారుడు షేక్ అబ్దుల్ కరీం (25), నెరబైలుకు చెందిన ఎర్ర సురేష్ కుమారుడు ఎర్ర బాలాజీ (24), పెనుమూరు మండలం చిప్పరపల్లికి చెందిన నందకుమార్ కుమార్ కుమారుడు జశ్వంత్ (20), బంగారుపాళెం మండలం తుంబపాలెం గ్రామానికి చెందిన గంగాధరం కుమారుడు ధనశేఖర్ అలియాస్ రవి (26) చిన్ననాటి నుంచే చెడు అలవాట్లు, వ్యసనాలకు లోనయ్యారు. ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను దొంగిలించి తక్కువ ధరలకు అమ్ముతున్నారు. తిరుపతి నగరంలోని అలిపిరి, ఈస్ట్ పోలీస్ స్టేషన్, పెనుమూరు, పాకాల పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన బైక్ దొంగతనాలపై క్రైం ఏఎస్పీ విమలకుమారి నేతృత్వంలో తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రాంభించారు. ఇది ఆ ముఠా పనేనని గుర్తించి, వారి కదలికలపై నిఘా పెట్టారు. బుధవారం మధ్యాహ్నం ఐదుగురు నిందితులను జూపార్క్ రోడ్డులోని క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో అరెస్ట్ చేశారు. విచారించి వారు దొంగిలించి దాచి ఉంచిన 16 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. కేసును ఛేదించిన క్రైం సీఐలు, ఎస్ఐ, క్రైం పార్టీ సిబ్బంది ఏఎస్ఐ జోగారావ్, హెడ్ కానిస్టేబుళ్లు గోపికృష్ణ, బసవరాజు, రమేష్, కానిస్టేబుళ్లు ప్రసాద్, మోహన్, నాగరాజచెట్టి, హరిప్రసాద్, పూర్ణచంద్ర, ఆర్పీఎఫ్ సిబ్బందికి ఏఎస్పీ రివార్డులు ప్రకటించారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్ మాయాజాలం

● రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మోసం
● న్యాయం కోసం మహిళల వేడుకోలు


విలేకరులతో మాట్లాడుతున్న బాధిత మహిళలు

సత్యవేడు, ఫిబ్రవరి 22: సత్యవేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో తమను మోసం చేశాడని ఇద్దరు మహిళలు ఆరోపించారు. గురువారం వారు సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే.. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన రేష్మ, లలిత. నెలవాయి గ్రామంలో సర్వే నెం.68లో ఇంటి స్థలాలు వారి భర్త పేర్లతో ఉన్నాయి. ఈ క్రమంలో భర్త అన్నాదురై పేరుపై ఉన్న 4 సెంట్ల స్థలంతో పాటు అందులో ఉన్న ఇంటిని తనపై రిజిస్ట్రేషన్ చేయించాలని రేష్మ కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్‌ను సంప్రదించింది. అదేవిధంగా లలిత సైతం భర్త ఉపేంద్ర ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం కంప్యూటర్ ఆపరేటర్‌ను సంప్రదించింది. అయితే వీరిద్దరి ఇంటిస్థలాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలంటే రూ.లక్షా 36 వేలు అవుతుందని రాజశేఖర్ తెలిపాడు. అతడి మాటలు నమ్మి రేష్మ రూ.73వేలు, లలిత రూ.63వేలు చెల్లించారు. రిజిస్ట్రేషన్ పూర్తయింది. పత్రాలు వచ్చాక పరిశీలించగా అన్నాదురై ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనల మేరకు స్టాంపు డ్యూటీ, యూజర్‌చార్జీలు కలిపి రూ.37,440 చలానా రూపంలో బ్యాంకుకు జమైనట్టు ఉంది. అలాగే ఉపేంద్ర ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌కి సంబంధించి రూ.27,930లు జమైంది. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ తమను మోసం చేశారని రేష్మ, లలిత సబ్ రిజిస్ట్రార్ రూపావాణిని ఆశ్రయించారు. అయితే రాజశేఖర్ వంటి ప్రైవేటు వ్యక్తులు ఇక్కడ ఎవరూ పనిచేయడం లేదని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాము అదనంగా చెల్లించిన నగదు ఇప్పించాలని వేడుకున్నారు.

టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రచారం

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 22: టీడీపీ, జనసేన నాయకులు గడప గడపకు ప్రచారం చేపట్టారు.చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని కుమారుడు వినీల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి కల్పా రవి, నాయకులు కొమ్మక లక్ష్మీదేవి, నాగరాజ, హరిశ్చంద్ర, సుబ్రమణ్యం, వెంకట శివరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, అమరనాథ రెడ్డి, అశోక్ రెడ్డి, కేశవులు నాయుడు, సురేంద్ర బాబు, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పుట్టిన రోజుకు రండి

● ఫ్లెక్సీలు కట్టి, కరపత్రాలు పంచిన కరుణ


ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న కరుణాకరరెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర 894వ పుట్టిన రోజు పండుగకు అందరూ హాజరు కావాలని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఫ్లెక్సీలు కట్టి, కరపత్రాలు పంచిపెట్టారు. మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 24వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు గోవిందుడి ఆలయ ముఖద్వారం నుంచి, చతుర్మాడ వీధుల్లో ఆధ్యాత్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండేళ్లుగా తిరుపతి పుట్టిన రోజును వైభవంగా నిర్వహించామని, మూడోసారి అదేవిధంగా జరుపుకుందామని అన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం నగరంలో చోటుచేసుకుంది. వెస్ట్ ఎస్ఐ బాలకృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి రిజర్వాయర్ కాలనీకి చెందిన ఆవుల శేఖర్, భాను కుమార్తె వి.హేమావతి (38) కొద్దికాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. బుధవారం రాత్రి ఆమె తమ ఇంట్లోని బాత్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని తల్లి భాను గుర్తించింది. వెంటనే రుయా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. కుమార్తె మరణంపై గురువారం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరణానికి కారణం కడుపు నొప్పా లేక మరేదైనాన కనుగొనాలంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కవలల పండుగ



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: యశోదనగర్‌లోని వేమన విజ్ఞానం కేంద్రంలో గురువారం కవలల పండుగ నిర్వహించారు. తిరుపతి, అన్నమయ్య, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలతో పాటు హైదరాబాదు, చెన్నై, బెంగళూరు మహానగరాల నుంచి కూడా కవలలు తరలివచ్చారు. ఆరు నెలల నుంచి 40ఏళ్ల వయసున్న జంటలు, వారి కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని కనువిందు చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఆటపాటలతో అలరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. నిర్వాహకులు తిరుపతికి చెందిన ట్విన్స్ హేమావతి, హేమలత సొంత నిధులతో వారికి జ్ఞాపికలు అందజేశారు.

ఎలక్ట్రిక్ ఏసీ బస్సు డ్రైవర్ చేతివాటం

కేసు నమోదు చేసిన రైల్వే కోడూరు పోలీసులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: అలిపిరి డిపో పరిధిలో నడుస్తున్న అద్దె ఎలక్ట్రిక్ ఏసీ బస్సు డ్రైవర్ చేతివాటానికి పాల్పడ్డాడు. ఈ విషయం రుజువు కావడంతో గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే కోడూరు పోలీసుల కథనం మేరకు... కడపకు చెందిన ఎం.సురేష్‌బాబు గతేడాది జూలైలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా చేరాడు. కడప-తిరుపతి మధ్య తిరిగే బస్సులో విధులు నిర్వహించేవాడు. టిమ్ టిక్కెట్స్‌ను జిరాక్స్ చేసుకుని ఉదయాన్నే స్క్వాడ్ ఉండదని భావించి ప్రతిరోజూ తొలి ట్రిప్పుకే రెండు టిక్కెట్లు జారీ చేసి సొమ్ము చేసుకుంటున్నాడు. 17వ తేదీ వేకువజామున రైల్వేకోడూరు పరిధి బాలాయపల్లి వద్ద స్క్వాడ్ తనిఖీ చేసింది. టిమ్‌ను పరిశీలించగా రెండు టిక్కెట్లు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఆ వెంటనే బస్సును అలిపిరికి తీసుకొచ్చి విచారించారు. సమగ్ర పరిశీలన అనంతరం ఫేక్ టిక్కెట్లు సృష్టించాడని నిర్ధారించారు. అదుపులోకి తీసుకోవడానికి ఇంటి వద్దకు వెళ్లగా అప్పటికే డ్రైవర్ కుటుంబ సభ్యులతో సహా పరారీలో ఉన్నాడు. రైల్వే కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో డిజిలాకర్లు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22 : సరోజినీదేవి రోడ్డులోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌లో డిజిటల్ ఇండియాలో భాగంగా ఏర్పాటు చేసిన డిజిలాకర్లను గురువారం సమగ్రశిక్షా కమ్యూనిటీ మొబలైజ్ అధికారి(సీఎంవో) సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు, ఐడీ కార్డులు, ముఖ్యమైన పత్రాలను భద్రపరచుకునేందుకు డిజిలాకర్లు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు. హెచ్‌ఎం బి.శారదావేణి, టీచర్లు వాసవి, చక్రధర్, సూర్యకుమారి, సీఆర్‌పీలు ఆషా, షాలిని, వేణు, నవీన్‌కుమార్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్వీ జూనియర్ కాలేజీకి ప్రొజెక్టర్ వితరణ



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలకు 1973-75 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు పాదిరి ద్వారకనాథ్ రెడ్డి, దామోదర్‌రెడ్డి రూ.40వేలు విలువచేసే ప్రొజెక్టర్‌ని వితరణ చేశారు. కళాశాలలో డిజిటల్ క్లాసుల నిర్వహణ కోసం ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబును కలసి అందించారు. వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కళాశాల విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

టీడీఆర్ బాండ్ల అవినీతిలో ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్‌కు జైలు ఖాయం

- టీడీపీ ఇన్‌ఛార్జి సుగణమ్మ -



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 22: తిరుపతిలో రూ.4వేల కోట్లకు పైగా టీడీఆర్ బాండ్ల స్కాం జరిగిందని, టీడీపీ అధికారంలోకి రాగానే విచారణ జరిపించి ప్రధాన బాధులైన భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డిని జైలుకు పంపడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ కాళ్లు పట్టుకుని తన కొడుక్కి తిరుపతి ఎమ్మెల్యే సీటు తెప్పించుకున్నారని, దీనికి కావాల్సిన పెట్టుబడిన తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లతో దోచేసుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచక కార్యక్రమాలను టీడీపీ ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూనే ఉన్నా అధికార దర్పంతో యథేచ్ఛగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో యువత గంజాయి మత్తులో మునిగిపోవడానికి పరోక్షంగా వైసీపీ కారణమని ధ్వజమెత్తారు. కపిలతీర్థం వద్ద నిర్మించిన మున్సిపల్ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సు లీజులో నెలకు రూ.2వేలు తక్కువ అద్దెకు ఇచ్చి నెలకు రూ.8లక్షలు డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో దంపూరు భాస్కర్‌యాదవ్, బుల్లెట్ రమణ, శాంతమ్మ, పుష్పలత, అనిత, లక్ష్మి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

హార్లీ డేవిడ్‌సన్ ఎక్స్ 440 బైక్ విడుదల



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22 : హీరో మోటార్ కంపెనీ నుంచి సరికొత్తగా రూపొందించిన హార్లీ డేవిడ్‌సన్ ఎక్స్ 440 బైక్‌ను పృథ్వీ హీరో షోరూం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హీరో మోటార్ కార్పొరేషన్ ఏరియా మేనేజర్ విజయకణ్ణన్, షోరూం అధినేతలు పృథ్వీరెడ్డి, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వాహనం ధర రూ. 2,59,500గా నిర్ణయించామన్నారు. అత్యాధునిక సదుపాయాలతో యువతను ఆకట్టుకునేలా రూపొందించారన్నారు. మార్కెట్‌లోకి విడుదల సందర్భంగా 15 మంది కస్టమర్లకు డెలివరీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం జీఎం హిమబిందు, సర్వీస్ జీఎం నాగేంద్ర, పూర్ణచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ


విద్యా సామగ్రిని వితరణ చేస్తున్న సుబ్రహ్మణ్యం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: టెన్త్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం పద్మావతిపురంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణ చేశారు. ముఖ్య అతిథులుగా దాతలు వైప్రవీణ్, ఈశ్వర్‌ప్రకాష్, హర్షవర్ధన్‌రెడ్డి, వై.ఎస్.బాబు పాల్గొన్నారు. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయదారుడి అరెస్ట్

● రూ.10,400 విలువైన 74 బాటిళ్ల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22 : ప్రభుత్వ మద్యాన్ని అధిక ధరకు బ్లాక్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని తిరుపతి వెస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.10,400 విలువజేసే 74 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ ఎస్ఐ బాలకృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం, మంగళంపేట బలిజవీధికి చెందిన పి.రమణయ్య కుమారుడు పేరూరి శేఖర్‌కుమార్ అలియాస్ శేఖర్ (36) ప్రసుతం తిరుపతి నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్నారు.ఉదయం పూట నెహ్రూనగర్‌లోని హారిక కిచెన్ రెస్టారెంట్ పక్కనే ఉన్న వీధిలో ఓ బ్యాగ్‌లో ప్రభుత్వ మద్యం బాటిళ్లు పెట్టుకుని అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. గుర్తించిన వెస్ట్ ఎస్ఐ బాలకృష్ణయ్య గురువారం ఉదయం అక్కడికి చేరుకుని శేఖర్‌కుమార్ వద్ద తనిఖీ చేశారు. ప్రభుత్వ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారించి దాచి ఉంచిన 74 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.10,400 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. అనుమతి, లైసెన్స్ లేకుండా ప్రభుత్వ మద్యాన్ని విక్రయిస్తున్నందుగాను ఏపీ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

గంగిరెడ్డిపల్లెలో పల్లెబాట

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22: మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో పల్లెబాట కార్యక్రమాన్ని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైసీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీరాణి భానుకుమార్‌రెడ్డి, చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ మునీంద్రబాబు, లక్ష్మీపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు నివేదికలతో ఖనిజ సంపదను దోచేస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 22: గ్రీన్ ట్రిబ్యునల్‌కు తప్పుడు నివేదికలు సమర్పించి రాష్ట్రంలో ఖనిజ సంపదను దోచేస్తున్నారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ పరిపాలనలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఖనిజ సంపద దోపిడీకి గురవుతోందన్నారు. ఇసుక రీచ్‌లకు ఎక్కడా అనుమతులు లేవని కలెక్టర్లు గ్రీన్ ట్రిబ్యునల్‌కు తప్పుడు నివేదికలు అందజేశారని ఆరోపించారు. అయితే దీనిపై గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యులు విచారణ చేపడితే వంద అడుగుల లోతుకు ఇసుక తవ్వడాన్ని గుర్తించిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో రాత్రికి రాత్రి యథేచ్ఛగా ఇసుకను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. దీనిపై టీడీపీ నాయకులు కలెక్టర్‌కు, రెవెన్యూ, పోలీసు శాఖకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై రూ.18కోట్లు జరిమాన విధించడం ఇందుకు నిదర్శనమన్నారు. కొత్తగా వచ్చిన కలెక్టర్, ఎస్పీ స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం రాగానే అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు విజయకుమార్, మునస్వామియాదవ్, సుధాకర్‌నాయుడు, శివకుమార్, మునికృష్ణ, చెంగయ్య, కృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీకి ఘన నివాళి



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: కస్తూర్బా గాంధీ 79వ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ రోడ్డులోని కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్టు కార్యాలయంలో గురువారం ఆమెకు ఘన నివాళి అర్పించారు. ట్రస్టు చైర్మన్ పి.సి.రాయలు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ ట్రస్టు పేరుతో రెండు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పి.రామచంద్రారెడ్డి, రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్‌లో జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్‌కో, తిరుపతికి చెందిన జీహెచ్ జాబ్ కన్సల్టెన్సీ, ఐటీ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. 20కిపైగా సంస్థలు హాజరవ్వగా జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 600మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. హెచ్ఆర్ టీమ్స్ నేతృత్వంలో విద్యార్థులకు రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభచాటిన 374మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి, ఆఫర్ లెటర్లు అందించారని వివరించారు. తమ కళాశాలకు చెందిన 224మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ స్వామినాథ్, హెచ్ఆర్‌కో ప్రతినిధి శ్రీకాంత్, జీహెచ్‌సంస్థ ప్రతినిధి హారిక, అధ్యాపకులు అభినందించారు.

కాంగ్రెస్‌కు 14 ఎంపీ స్థానాలు ఖాయం

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీకి 14 స్థానాలు లభిస్తాయనే నమ్మకం తనకు ఉందని ఆ పార్టీ రాజసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడిగా తనను ఎంపిక చేసిన నేపథ్యంలో తొలిసారిగా తిరుమలకు వచ్చి స్వామి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. బీసీ బిడ్డనైన తనను పెద్దల సభకు పంపిన పార్టీ అధిష్ఠానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలో రామరాజ్యం వస్తుంది

కేంద్రమంత్రి భగవత్ కరద్



తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఎలా అయితే రామ మందిర నిర్మాణం పూర్తయిందో అలానే మోదీ సంకల్పంతో దేశంలో రామరాజ్యం వస్తుందని కేంద్రమంత్రి భగవత్ కరద్ అన్నారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నడకమార్గంలో ముగ్గుబావి పరిశీలన



ముగ్గుబావిని పరిశీలిస్తున్న చైర్మన్

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అలిపిరి నడక మార్గంలోని ముగ్గుబావిని గురువారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. నరసింహస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న ఈ పురాతన బావిని అధికారులతో కలిసి పరిశీలించారు. 600 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ బావి పిచ్చి మొక్కలతో నిండి, శిథిలావస్థలో ఉండటాన్ని గుర్తించి వెంటనే శుభ్రపరిచి, ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగుల పనితీరుపై ప్రత్యేక దృష్టి

తనిఖీల్లో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి

13 మంది ఇంజనీరింగ్ ఉద్యోగులకు మెమోలు జారీ



తనిఖీలు చేస్తున్న వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22: యూనివర్సిటీలోని అన్ని విభాగాల ఉద్యోగుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. పలు విభాగాల్లో ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగుల హాజరు, సమయ పాలన, పనితీరుపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఇంజనీరింగ్ ఆఫీసు టైంలో 13 మంది గైర్హాజరైన విషయాన్ని పరిశీలించి, సంబంధిత ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులను సహాయకులుగా కాంట్రాక్టర్లు వినియోగించుకోవడానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు. క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా : ఫిబ్రవరి 22: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో, రామానుజా సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 69,191 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,295 మంది తలనీలాలు సమర్పించారు.

29న సతీష్‌రెడ్డి రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22: డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, దేశ రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఈనెల 29వ తేదీ తిరుపతికి రానున్నారు. ఆత్మ నిర్భర్ భారత్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై అఖిల భారత శిక్షక్ మహా సంఘ్ నిర్వహించే సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. 29 మధ్యాహ్నం 4 గంటలకు ఎస్వీయూ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి, ఏబీఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త కార్యదర్శి గుంతా లక్ష్మణ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కృష్ణ ప్రశాంతి హాజరుకానున్నారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి తెలిపారు.

విద్యుత్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టుకు మూడో స్థానం

తిరుపతి,(ఆటోనగర్)ఫిబ్రవరి 22 : రాష్ట్ర విద్యుత్ సంస్థలో ఉద్యోగులకు నెల్లూరులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. జన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నిర్వహించిన ఈ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన జట్టును గురువారం తిరుపతి ఎస్ఈ కార్యాలయంలో సన్మానించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వాసుదేవరెడ్డి ఎస్ఈ, ఈఈలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జె.కిరణ్‌కుమార్, పురుషోత్తం, లీలారామ్ క్రీడాకారులు పాల్గొన్నారు.



బీటలు వారిన పిల్లర్లు, సీలింగ్, గుంతలు తేలిన బస్టాండు ఆవరణ

సమస్యల వలయంలో సీబీఎస్

- ఊడుతున్న సీలింగ్
- బీటలు వారిన గోడలు, పిల్లర్లు
- గుంతలమయమైన ఆవరణ
- ఇంటిగ్రేటెడ్ బస్టేషన్ నిర్మాణంలో కాలయాపన



కూలేందుకు సిద్ధంగా ఉన్న సీలింగ్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22 : ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్ సమస్యల వలయంలో చిక్కుకుంది. దీని పరిధిలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండల బస్టాండులున్నాయి. భవనాలు నిర్మించి నాలుగు దశాబ్దాలకు పైగా కావడంతో మరమ్మతులకు గురయ్యాయి. ఐదేళ్లగా సీలింగ్ పెచ్చులూడుతోంది. పిల్లర్ల కింది భాగం, అడ్డపిల్లర్లకు, స్లాబ్‌లకు పగుళ్ల వచ్చాయి. గోడలు బీటలువారాయి. వర్షాకాలంలో ఉరుస్తోంది. మెట్లు పగిలిపోయాయి. గదుల కిందిభాగం కుంగిపోయింది. బస్సులు ఆగే ప్లాట్‌ఫామ్స్ పగిలిపోయాయి. ఆవరణలో కాంక్రీటు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఎలుకల మూలాన అండర్ డ్రైనేజీ పాడైపోయింది. వర్షపునీరు తరలించే తూములు పూడిపోయాయి. ప్యాచ్‌వర్కులు చేసుకుంటూ కొంతకాలం గడిపారు. ప్రమాదం పొంచి ఉండడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భవనాల దుస్థితిపై ఫిర్యాదులు రావడంతో ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, నిపుణులతో అధ్యయనం చేయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. రెండేళ్ల క్రితం సాయిల్ టెస్టు, బస్సులు, ప్రయాణికుల సంఖ్య, వాణిజ్య సామర్థ్యం తదితరాలను పరిశీలించి, నివేదిక తయారు చేశారు. రూ.500కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ అత్యాధునికంగా నిర్మించాలని నమూనా కూడా రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఏడాది కాలంగా టెండర్ల ఖరారు ప్రక్రియ కొలిక్కిరాలేదు. అయోధ్య రామమందిరం తర్వాత టెండర్లకు వెళ్లాలనుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆ ప్రతిపాదనల ఊసేలేకుండా పోయింది. ఎన్నికల తర్వాత చూద్దామని కేంద్రం నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది.

నేడు ఆర్టీసీ ఎండీ రాక

మదనపల్లెలో ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రారంభించడానికి ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు శుక్రవారం తిరుపతి వస్తున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ బస్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ప్రయాణికులు, సిబ్బంది కోరుతున్నారు.

పొర్లు దండాలతో వ్యవసాయ కాలేజీ కార్మికుల నిరసన



పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22 : సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టిన ఎస్వీ వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కాంట్రాక్ట్ కార్మికులు గురువారం రోడ్డుపై పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. గోవిందా..గోవిందా నామస్మరణ చేస్తూ సీఎం జగన్ కళ్లు తెరిపించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.జయచంద్ర, ఆప్కాస్ అధ్యక్షుడు గండికోట చిన్నబాబు మాట్లాడుతూ ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని, ప్రభుత్వం జీవో ఇచ్చినా వర్సిటీలో అమలుకు నోచుకోకపోవడం విచారకరమని వాపోయారు. నాయకులు వరలక్ష్మి, చంద్రమ్మ, సుబ్బు, మునిలక్ష్మి, రాధా, గిరి, రేవతి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయా లు), ఫిబ్రవరి 22: పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు, ఉద్యోగులకు హర్యామ నిటీస్ బ్లాక్ వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, సలహాలు అందించారు. ఆయుర్వేద వైద్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు.

పీసీసీ ఓబీసీ విభాగ కార్యదర్శిగా గోపీగౌడ్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 22: పీసీసీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతికి చెందిన గోపీగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ ఓబీసీ చైర్మన్ ఎం.వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకముంచి ఈ పదవి అప్పగించినందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, జంగా గౌతం, వెంకటరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

సంస్కృత భాష సంరక్షణలో అగ్రగామి సంస్కృత వర్సిటీ

వర్చువల్‌లో భవనాలు ప్రారంభించిన కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్



శ్రీజగన్నాథ కల్చర్, చైతన్య ఫిలాసఫీ, ఉత్కలమంజూష గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అతిథులు - వర్చువల్‌లో మాట్లాడుతున్న కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 22: జాతీయ సంస్కృత వర్సిటీ సంస్కృత భాషను సంరక్షించడంతో పాటు సంస్కృతీ సంప్రదాయాలను ప్రచారం చేయడంలో అగ్రగామిగా ఉందని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. వర్సిటీలో నూతనంగా నిర్మించిన చెలికాని అన్నారావు బహుళ ప్రయోజక క్లాస్‌రూమ్ కాంప్లెక్స్, శ్రీవేంకటాచల బాలుర హాస్టల్, కార్యాలయ భవనాలను గురువారం ఆయన వర్చువల్‌గా హాజరై ప్రారంభించారు. జగన్నాథ సాహిత్యంపై నిర్వహించిన జాతీయ సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ.. వర్సిటీ ద్వారా ఎన్నో విశేషమైన కార్యాలు సంస్కృత క్షేత్రంలో చేస్తూ దినదినాభివృద్ధి సాధిస్తున్నారని అభినందించారు. ప్రత్యేకించి వర్సిటీలో ఉత్కలపీఠం ఏర్పాటు చేసి 25వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా రజత మహోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ ఉత్కలపీఠం ద్వారా జగన్నాథ సంప్రదాయాన్ని, చైతన్య ఫిలాసఫీని, ఆధ్యాత్మిక తత్వాలను విద్యార్థులకు అందిస్తుండడం గొప్పదైన విషయమని వివరించారు. సంస్కృత భాష సంరక్షణ, భారతీయ సనాతన ధర్మ సంరక్షణకు ప్రధాని మోదీ కృతసంకల్పంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వేదికపై ఉన్న అతిథులతో కలసి కేంద్ర మంత్రికి సభాముఖంగా స్మృతిచిహ్నాన్ని అందించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నామన్నారు. అతిథులుగా హాజరైన తిరుపతి ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్‌తో ఉత్కలపీఠం సిల్వర్‌జూబ్లీ కీర్తి స్థూపాన్ని ప్రారంభించారు. స్వామి నారాయణ సంప్రదాయ సంస్థ ప్రముఖులు, మహామహోపాధ్యాయ సాధుభద్రేశదాసస్వామి నైమిశారణ్యంలోని గురుకులాన్ని ప్రారంభించారు. కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్ వర్కేడి, మాజీ వీసీ హరేకృష్ణశతపథి మాట్లాడారు. అనంతరం జగన్నాథ కల్చర్, చైతన్య ఫిలాసఫీ, ఉత్కల మంజూష గ్రంథాలను ఆవిష్కరించి, లోకార్పణ చేశారు. ఉత్కలపీఠం సిల్వర్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యులు ప్రొఫెసర్ హరిహరపండా, ఉత్కలపీఠం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజనపండా, సాహిత్య విభాగం ప్రొఫెసర్ శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో 200 గుండె శస్త్ర చికిత్సలు విజయవంతం

సీఓఓ డాక్టర్ శ్రీధర్‌ముని



సమావేశంలో మాట్లాడుతున్న సీఓఓ డాక్టర్ శ్రీధర్‌ముని

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో అత్యధిక విజయవంతమైన రేటుతో 200 కార్డియోథొరాసిక్, వాస్కులర్(సివిటిఎస్) శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) డాక్టర్ శ్రీదర్‌ముని తెలిపారు. గురువారం రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ త్రిలోక్‌ను సన్మానించారు. శ్రీధర్‌ముని మాట్లాడుతూ గుండె శస్త్ర చికిత్సలలో నైపుణ్యం కలిగిన డాక్టర్ త్రిలోక్ అతి తక్కువ కాలంలో 200 ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయడం అభినందనీయమన్నారు. అందులోనూ 90 శాతం సర్జరీలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసి పేదల ప్రాణాలను కాపాడామని తెలిపారు. డాక్టర్ త్రిలోక్ పొందూరు మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో అన్ని విభాగాలు ఒకేచోట ఉండటం, ముఖ్యంగా గుండెకు సంబంధించిన అత్యాధునిక పరికరాలు, వసతులు అందుబాటులో ఉండటంతో ఇంతటి విజయం సాధించగలిగామన్నారు. ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ సునంద కుమార్‌రెడ్డి, ఎస్‌వీ ప్రసాద్ డాక్టర్ త్రిలోక్‌కు అభినందించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రతిమ పాల్గొన్నారు.



తేజస్విని, భరత్ దంపతులు - వైవీ సుబ్బారెడ్డి - తిలక్ వర్మ

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హీరో నందమూరి బాలకృష్ణ కుమార్తె తేజస్విని, భరత్ దంపతులు, క్రికెటర్ తిలక్ వర్మ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

తెప్పలపై గోవిందరాజస్వామి విహారం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 22: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఉదయం 10.30నుంచి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు పసుపు, పాలు, తేనె, పెరుగు, చందనాదులతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంకీర్తనాగానం భక్తులను అలరించాయి. తిరుమల చినజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు దుర్మార్గం: సీఐటీయూ



నినాదాలు చేస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నేతలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22: రైతుల సమస్యలపై ఉద్యమం చేస్తున్న రైతులపై కాల్పులు చేయడం దుర్మార్గమని సీఐటీయూ నాయకుడు సాంబశివయ్య అన్నారు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖానౌరి వద్ద రైతులపై పోలీసుల కాల్పులకు నిరసనగా గురువారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, రైతు సంఘ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉద్యమాన్ని అణచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేయడంతోపాటు కాల్పులు జరపడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సీఐటీయూ నాయకులు అల్లెయ్య, రియాజ్, పళణి, పద్మనాభం, మనోహర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

కోట, ఫిబ్రవరి 22: వీరారెడ్డిసత్రం సమీపంలో గురువారం ఓ బైక్ ఢీకొన్న సంఘటనలో గ్రామానికి చెందిన అంకయ్య, లక్ష్మమ్మ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దంపతులు గురువారం సైకిల్‌పై క్రాస్‌రోడ్డు సమీపంలోకి వస్తుండగా.. వాకాడు నుంచి బైక్‌పై వస్తున్న ఓ యువకుడు వీరిని ఢీకొట్టి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్హులకు విరివిగా రుణాలివ్వాలి

● లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్

నాయుడుపేట, ఫిబ్రవరి 22: అర్హులైన వారికి విరివిగా రుణాలివ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని బ్యాంకర్లు, అధికారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం, యువతకు ఉపాధి కోసం, టిడ్కో గృహాలకు, వ్యవసాయ రంగానికి రుణాలను ఇవ్వాలని సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలోపేతానికి అంతర్గత రుణాలు, బ్యాంక్ ఖాతాదారులకు బీమా పథకాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, టిడ్కో జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, మెప్మా బ్యాంక్ లింకేజీ డీపీ ఎం.బాబా, డీఆర్‌డీఏ డీపీ సుబ్బారెడ్డి, మెప్మా, వెలుగు, వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

'సాగరమాల' భూరికార్డుల పరిశీలన


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట, ఫిబ్రవరి 22: మండలంలోని పుదూరు, కాపులూరు ప్రాంతాల్లో సాగరమాల రహదారి ఏర్పాటుకు కోల్పోయే భూముల రికార్డులను ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయిలో భూములను, వాటి హక్కుదారులను గుర్తించాలని తహసీల్దారు కె.కళ్యాణి, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రలకు సూచించారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను పోటీకి దింపుతాం

● ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను పోటీలోకి దింపుతామని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్ని ప్రజాసంఘాలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి.. అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఆర్టీసీ కార్గోలో నిషిద్ధ వస్తువులివే..


మాట్లాడుతున్న సురేంద్రబాబు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఆర్టీసీ కార్గోలో నిషేధిత వస్తువులు స్వీకరించేది లేదని కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిషేధిత వస్తువుల మూలాన చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాంటివి బుక్‌చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గోపాలిన్(పెట్రో కెమికల్స్), కిరోసిన్, స్పిరిట్స్, టర్పెంట్ ఆయిల్, యాసిడ్, సల్ఫర్, కోల్‌తార్, గన్‌పౌడర్, తుపాకి, తోలు, చర్మాలు, పచ్చి, ఎండు చేపలు, పేలుడుపదార్థాలు, గ్యాస్ సిలిండర్లు, కోళబరాలు, ఆర్డినెన్స్, ఎముకలు, కొమ్ములు, అన్నిరకాల జంతువులు, బ్యాటరీలు, బొగ్గు, నల్లమందు, గంజాయి, మాదకద్రవ్యాలు, గుట్కా,పొగాకు, పాన్‌మసాలాలు,స్కూటర్, మోటార్ సైకిళ్లు, తలవెంట్రుకలు, సన్‌మైకా రోల్స్, గాజు వస్తువులు, లిక్విడ్ ఆయిల్స్, ఇంక్, పెయింట్స్ తదితరాలు నిషేధించామని, ప్రజలు సహకరించాలని కోరారు.

మద్యం, గంజాయికి యువత బానిసలైపోయారు

వీసీకే ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 22: రాష్ట్రంలోని యువత మద్యం, గంజాయికి బానిసై పోయిందని, దీనికి సీఎం జగన్ పాలనే కారణమని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం, కడప ఉక్కు, రాజధాని, రాయలసీమ, ఉత్తరాంధ్రులకు ప్రత్యేక ప్యాకేజీ సాధించడం చేతకాని జగన్ మోహన్‌రెడ్డి వైనాట్ 175 అంటూ కామెడీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మోదీ దేశాన్ని నాశనం చేస్తుంటే జగన్ రాష్ట్ర సంపదంతా లూటీ చేశారని విమర్శించారు. ప్రజలు జగన్‌కు ఓట్లు వేయడానికి సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో వీసీకే ఇండియా కూటమితో కలిసి పోటీ చేస్తుందన్నారు. మార్చి 5న వీసీకే ఆధ్వర్యంలో మదనపల్లిలో ఇండియా కూటమి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో మురగేషన్ ప్రభు, రమేష్, మోహన్, శ్రీనివాసులు, రెడ్డెప్ప, రెడ్డి ప్రసాద్, చౌడప్ప, మణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనల పరిశీలన



నేతాజీ నగర్ గేటు వద్ద డీఆర్‌ఎం విశ్వనాథ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 22: దొరవారిసత్రం మండల పరిధిలో రైల్వే వంతెనలను దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం ఈబీ విశ్వనాథ్ పరిశీలించారు. నేతాజీనగర్, అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నెలబల్లి గ్రామాల్లో ఉన్న రైల్వే వంతెనలను ఆయన పరిశీలించారు. ఈ వంతెనల కింద వర్షాకాలం వర్షపు నీరు నిల్వచేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైల్వే సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయ చర్యలను వెంటనే చేపట్టాలను సూచించారు. ఆయనవెంట ఏడీఆర్‌ఎం ప్రతాప్ పలువురు రైల్వే సిబ్బంది ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 69,191 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,295 మంది తలనీలాలు సమర్పించారు.

శిథిలావస్థలో అంబేడ్కర్ భవనం



శిథిలమైన భవనం (ఇన్‌సెట్లో) ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గూడూరు, ఫిబ్రవరి 22: ఎన్నో శుభకార్యాలు, సమావేశాలకు వేదికగా నిలిచిన అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2000 సంవత్సరంలో పాత బస్టాండు సమీపంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించారు. ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పేదవారు తక్కువ అద్దెతో శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉండేది. ఒక రోజుకు భవనం అద్దెగా ఎస్సీ, ఎస్టీలకు రూ.2000, ఇతర కులాలవారికి రూ.5000గా నిర్ణయించారు. అందువల్ల పేద, మధ్య తరగతివారికి ఈ అద్దె ధరలు అందుబాటులో ఉండడంతో ఈ భవనాన్ని ఎక్కువగా వినియోగించుకునేవారు. కొన్నేళ్లకు భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2016 నుంచి అయితే నిరుపయోగంగా మారింది. ఆవరణంలో పిచ్చిమొక్కలు మొలిచి అడవిని తలపిస్తున్నాయి. కొంతమేర ప్రహరీ సైతం కూలిపోయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ.1.98కోట్లను మంజూరు చేసి, ఐసీఎస్ రోడ్డులో 30సెంట్ల భూమిని కేటాయించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిర్మాణ పనులు మొదలవలేదు. తర్వాతఅధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిధులు నిలిచిపోయాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

వైసీపీ అండతో కేసు నీరుగారుస్తారా?

మీడియాపై దాడుల కేసుల్లో పోలీసుల తీరుపై టీడీపీ మండిపాటు



తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడులు చేసిన వ్యక్తులు తగిన మూల్యం చెల్లించుకున్న ఘటనలు చరిత్రలో అనేకం ఉన్నాయని, వైసీపీ రౌడీ మూకలకు, వారిని నడిపిస్తున్న జగన్ రెడ్డికి కూడా ఇదే పరిస్థితి దగ్గర పడిందని తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం టీడీపీ నాయకులు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ దౌర్జన్యాలతో బెదిరించే ప్రయత్నం చేస్తున్న వైసీపీ తీరును పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై ఎవరెవరు దాడిచేశారో ఆధారాలతో పత్రికల్లో ఫొటోలు వచ్చినప్పటికీ పోలీసులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ అండదండలతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.టీడీపీ నాయకులు పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, బుల్లెట్ రమణ, కొట్టే హేమంత్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, రుద్రకోటి సదాశివం, కరాటే చంద్ర, ఆముదాల తులసీరామ్, అనిత, హేమ, రేవతి, మునిరామయ్య, రాజయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై దాడి కేసులో అరెస్టు చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండు చేశారు.మీడియాపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్దవున్న గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం ఎర్రజెండాలను ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కస్టడీకి తీసుకున్న 15మంది నిందితులపై వెంటనే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగరకార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నేత ఎన్.డి.రవి మాట్లాడుతూ జర్నలిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలే కూలిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. అధికార పార్టీకి వత్తాసుగా పనిచేసిన అధికారుల ప్రస్తుత పరిస్థితిని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు.చంద్రశేఖర్, శ్రీరాములు, శివ, రాజా, మణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొడదాం: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కోట, ఫిబ్రవరి 22: వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడదామని టీడీపీ శ్రేణులకు బీసీసెల్ మండల అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి మీడియాతో మాట్లాడారు. కేశవరం పంచాయతీలో ముమ్మడి సురేంద్రబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా టీడీపీలో చేరితే స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు దానిని వక్రీకరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మరో మూడు నెలల్లో టీడీపీ ప్రభంజనం కొనసాగడం ఖాయమన్నారు. ఆ ప్రభంజనంలో వైసీపీ నేతలు కొట్టుకుపోతారని స్పష్టం చేశారు. గూడూరు నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీలోకి వలసలు వస్తుంటే వైసీపీ నాయకులు మతిభ్రమించి, రకరకాలుగా ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి జడ వేణు, ముమ్మడి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22: పెరియవరంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ డాక్టర్ భాస్కరయ్య, శాస్త్రవేత్త గోవిందురాజులు, ఏడీఏ నాగార్జున, పి.సుజాత, తిరుపాల్, ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట ఇన్‌చార్జి ఏఈగా నారాయణరెడ్డి

కోట, ఫిబ్రవరి22:కోట విద్యుత్ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈగా నారాయణరెడ్డిని గురువారం నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న మునీంద్ర పదోన్నతిపై తిరుపతికివెళ్లడంతో చెందోడు సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నారాయణరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎలక్ట్రిక్ ఏసీ బస్సు డ్రైవర్ చేతివాటం

పోలీసు కేసు నమోదు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 22: అలిపిరి డిపో పరిధిలో నడుస్తున్న అద్దె ఎలక్ట్రిక్ ఏసీ బస్సు డ్రైవర్ చేతివాటానికి పాల్పడ్డాడు. ఈ విషయం రుజువు కావడంతో గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే కోడూరు పోలీసుల కథనం మేరకు... కడపకు చెందిన ఎం.సురేష్‌బాబు గతేడాది జూలైలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా చేరాడు. కడప-తిరుపతి మధ్య తిరిగే బస్సులో విధులు నిర్వహించేవాడు. టిమ్ టిక్కెట్స్‌ను జిరాక్స్ చేసుకుని ఉదయాన్నే స్క్వాడ్ ఉండదని భావించి ప్రతిరోజూ తొలి ట్రిప్పుకే రెండు టిక్కెట్లు జారీ చేసి సొమ్ము చేసుకుంటున్నాడు. 17వ తేదీ వేకువజామున రైల్వేకోడూరు పరిధి బాలాయపల్లి వద్ద స్క్వాడ్ తనిఖీ చేసింది. టిమ్‌ను పరిశీలించగా రెండు టిక్కెట్లు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఆ వెంటనే బస్సును అలిపిరికి తీసుకొచ్చి విచారించారు. సమగ్ర పరిశీలన అనంతరం ఫేక్ టిక్కెట్లు సృష్టించాడని నిర్ధారించారు. అదుపులోకి తీసుకోవడానికి ఇంటి వద్దకు వెళ్లగా అప్పటికే డ్రైవర్ కుటుంబ సభ్యులతో సహా పరారీలో ఉన్నాడు. రైల్వే కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ

పరిశీలకుడిగా బడా కాంట్రాక్టర్..?

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 : వైసీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిశీలకులుగా ఓ బడా కాంట్రాక్టర్‌ను నియమించినట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థిత్వంపై ఆశావహుల్లో ఈయన పేరు కూడా ఇటీవల ప్రచారంలోకి వచ్చింది. అయితే ఆయన టీడీపీలో ఉండడంతో ఈ అంశాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ అదే నేతను వైసీపీ ఉన్నఫలంగా అబ్జర్వర్‌గా ప్రకటించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.వైసీపీ అభ్యర్థిత్వంపై ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

ముఖం చాటేస్తున్న ఎంపీటీసీలు...?

● కోరం లేక రద్దయిన శ్రీకాళహస్తి మండల సమావేశం


సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తి మండలంలో ఎంపీటీసీలు అధికార పార్టీకి ముఖం చాటేస్తున్నారన్న ఊహాగానాలకు బలం చేకూరింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంపీటీసీలు, సర్పంచ్ స్థానాలను అధికార పార్టీ ఏకగ్రీవంగా చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఉత్సాహం ఎంతో కాలం నిలవలేదు. గ్రామాలకు, స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకపోవడం... అలాగే స్థానిక రాజకీయ అంశాలతో నేతల్లో అసంతృప్తి నివురు గప్పిన నిప్పులా అలముకుంది. ఇంతలో వారం రోజుల క్రితం అధికార పార్టీకి ముగ్గురు జడ్పీటీసీలు ఊహించని షాక్ ఇచ్చారు. శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చన దేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య మరో మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మాజీ సర్పంచ్ హరి నాయుడు అందరూ కలిసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. కీలక పదవుల్లో ఉన్న ముగ్గురు నేతలు ఒకేసారి వైసీపీకి ఝలక్ ఇవ్వడంతో అందరూ ఖంగుతున్నారు. ఆతర్వాత వీరి తరహాలోనే నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి 33 మంది సర్పంచులు త్వరలో టీడీపీలోకి చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. ఇంతలో గురువారం శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించేలా అధికారులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మెజారిటీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో కనీసం 8 మంది ఎంపీటీసీలు హాజరైతేనే కోరం నిలుస్తుంది. గురువారం జరగాల్సిన సమావేశానికి కేవలం ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. కనీసం 21 మంది వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా 20మంది మాత్రమే ఇచ్చేశారు. ఇక ఎంపీపీ, వైస్ ఎంపీపీ సైతం కనబడకపోవడం గమనార్హం. ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే రావడంతో అధికారులు బిక్క మొహం వేశారు. కోరం లేని కారణం చూపుతూ సర్వసభ్య సమావేశాన్ని రద్దు చేశారు. ఇటీవల జడ్పీటీసీలు టీడీపీలో చేరడం...ఆ వెంటనే ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో గైర్హాజరు కావడం రాజకీయ చర్చకు దారితీసింది. ఎంపీటీసీలు ఉద్దేశపూర్వకంగా ముఖం చాటేశారా అన్న అనుమానాలు రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తం అవుతున్నాయి. కాగా అధికారుల సమాచార లోపంతోని ఎంపీటీసీలు రాలేకపోయారని అధికార పార్టీ నాయకులు సమర్థించుకుంటున్నారు.

బాల్య వివాహాలపై నిఘా పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివ పార్వతుల కళ్యాణం రోజున బాల్య వివాహాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని రోటరీ క్లబ్‌లో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహారావు, ఐసీడీఎస్ సీడీపీవో శాంతి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. వేదమంత్రాలతో ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రేపు సత్యనారాయణస్వామి వ్రతం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 22: వరదయ్యపాళెంలోని గోవర్ధనపురంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24వ తేదీ శనివారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ నేత తల్లి మృతికి ఆదిమూలం నివాళి



నారాయణవనం, ఫిబ్రవరి 22: నారాయణవనం మండలానికి చెందిన టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి సి.బాబు తల్లి సరోజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్‌కుమార్ గురువారం ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాబును ఓదార్చారు. అలాగే సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ కూడా సరోజమ్మ మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు.

ఘనంగా వరల్డ్ థింకింగ్ డే



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 22: ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్ జయదేవ్, లీడర్స్ యువశ్రీ, శైలజ, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

మరమగ్గాలకు విద్యుత్ ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

పుత్తూరు, ఫిబ్రవరి 22: మరమగ్గాలకు విద్యుత్ ఎక్సైజ్ డ్యూటీలో యూనిట్‌కు 96 పైసలను తగ్గిస్తూ ఉత్తర్వులను గురువారం ప్రభుత్వం జారీ చేసిందని మంత్రి రోజా ఓ ప్రకటనలో తెలిపారు. మరమగ్గ కుటుంబాలకు ఈ జీవోతో భారీ ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు మంత్రి వివరించారు.

వలంటీర్లకు ప్రోత్సాహకాలు

నారాయణవనం, ఫిబ్రవరి 22: మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా రత్న కింద ఐదుగురికి, సేవా మిత్ర కింద 190 మందికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి, సర్పంచ్ సాయిరవి తదితరులు పాల్గొన్నారు.

'నిజం గెలవాలి'ని జయప్రదం చేయండి / సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్


కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హెలెన్

నారాయణవనం, ఫిబ్రవరి 22: నారాయణవనం మండలంలో గురువారం జరగనున్న నిజం గెలవాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ పిలుపునిచ్చారు. గురువారం మండల పార్టీ నాయకులతో సమీక్షించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళా కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు. అనంతరం ఆమె తుంబూరులో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. టీడీపీ నాయకులు సుధాకర్‌నాయుడు, మునస్వామియాదవ్, శివకుమార్, గోవిందచౌదరి, నరేంద్ర, షణ్ముగం, గోపి, మునివేలు, కందస్వామి, వాసుదేవన్, విజయ్, కేఎస్.రవి, బాబు, మారిముత్తు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుంబూరుకు నారా భువనేశ్వరి రాక

టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుతో కలత చెంది మరణించిన మునివేలు కుటుంబాన్ని పరామర్శించేందుకు నారా భువనేశ్వరి గురువారం తుంబూరుకు విచ్చేయనున్నారు. ఈ మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతిని రాష్ట్ర రాజధానిగా చేయాలి

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 22: తిరుపతిని రాష్ట్ర రాజధానిగా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. గురువారం పుత్తూరు రైల్వేస్టేషన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ కూడా సరైన రాజధాని లేకుండా పాలన చేసిన ఘనత సీఎం జగన్ రెడ్డిదేనని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు భాస్కర్, చిరంజీవి, తేజోవతి, సింధుజ, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు దరఖాస్తులు

పుత్తూరు, ఫిబ్రవరి 22: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున జిల్లాలో పోటీ చేసేందుకు పార్టీ టిక్కెట్ కోసం ముగ్గురు అభ్యర్థులు గురువారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎన్నికల కమిటీకి దరఖాస్తులను అందజేశారు. చిత్తూరు పార్లమెంటు స్థానానికి ఆర్.బాబు, నగరి శాసన సభ స్థానానికి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి, జీడీనెల్లూరుకు టి.అమ్ములు దరఖాస్తు చేసుకున్నట్లు ఆ పార్టీ నాయకుడు చిరంజీవి తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి


మోహన్‌కుమార్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న గాలి భాను ప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 22: తిరుమణ్యం రాజుల కండ్రిగ ఆదిఆంధ్రవాడకు చెందిన టీడీపీ కార్యకర్త మోహన్ కుమార్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ గురువారం మోహన్ కుమార్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, ముకుంద, మునిరాజ, కుప్పయ్య, లోకనాథం, ధనంజయులు నాయుడు, వెంకటేశ్వరరావులున్నారు.

తేనెమంచు పురుగు ఉధృతిని నివారించాలి


పురుగు ఉధృతిని చూపుతున్న రైతులు

వడమాలపేట,ఫిబ్రవరి 22: మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణ చర్యలను రైతులకు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తెలియజేశారు. శ్రీబొమ్మరాజపురంలోని మామిడి తోటలను గురువారం సందర్శించారు. ఉద్యానశాఖ మండల అధికారి వెంకట సౌజన్య, రైతులు శేఖర్ రాజు, వెంకటరామరాజు, శ్యాసుందర్‌రాజు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఉమ్మడి ప్రభుత్వంతోనే అరాచకం అంతం : జనసేన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతో వైసీపీ అరాచకాలకు అంతం పలుకుదామని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత పిలుపునిచ్చారు. శ్రీకాళ హస్తిలోని ఆర్టీసీ కూడలి నుంచి పెళ్లి మండపం వరకు గురువారం ఉమ్మడి మ్యానిఫెస్టోపై ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, గణేష్, జ్యోతిరామ్, చిరంజీవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ ..చూడాల్సిన సినిమా: సుధీర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: రాజధాని ఫైల్స్ సినిమా రాష్ట్ర ప్రజలందరూ చూడాల్సిన సినిమా అని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి లోని విజయలక్ష్మి థియేటర్లో గురువారం రాజధాని ఫైల్స్ సినిమాను పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అమరావతి కోసం రైతులు చేసిన త్యాగాలను రాజధాని సినిమా గుర్తు చేస్తుందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి రాజధాని కూడు పెడుతుందా అని మాట్లాడటం ఆయన అజ్ఞానానికి అద్దం పడుతుందన్నారు. రాజధానితో ఉపాధి కల్పన, సంపద సృష్టి జరుగుతుందని చెప్పారు. దాంతో రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందని వివరించారు. నాయకులు మునిరాజనాయుడు, విజయ్‌కుమార్, కంఠా రమేష్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ ప్రాణత్యాగం చిరస్మరణీయం


నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రాణత్యాగం చిరస్మరణీయం అని శ్రీకాళహస్తి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కీర్తించారు. పట్టణంలోని పెళ్లి మండపం కూడలి వద్ద గురువారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్థంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి చెంచు రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తిలోని ఏ న ౦ గ ౦ ల గ ౦ ౦ ట దళితవాడలో గురువారం ప్రచారం చేశారు. శ్రీకాళహస్తి బీజేపీ ఎమ్మెల్యేగా కోలాఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ సుబ్బ మణ్యం రెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్, నాయకులు అమర్నాథ్, ఢిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెల హరికి అభినందన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మిద్దెల హరికి ఆశాఖ అధికారులు ఘనంగా అభినందనలు తెలిపారు. బుధవారం విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం మిద్దెల హరిని శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహంలో పలువురు స్థానిక ఆర్టీసీ అధికారులు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజ వర్ధన్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పార్లమెంటు కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: ముక్కంటి ఆలయాన్ని పార్లమెంట్ కమిటీ డాక్టర్ భగవత్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో నాగేశ్వరరావు ముక్కంటి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

తెలుగు యువత కదం తొక్కాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో తెలుగు యువత కదం తొక్కాలని శ్రీకాళహస్తి టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం 'వాయిస్ ఆఫ్ ది శ్రీకాళహస్తి యూత్' అనే అంశంపై యువత చర్చా వేదిక జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి గెలుపు కోసం యువత కంకణ బద్ధులు కావాలని కోరారు. అలాగే శ్రీకాళహస్తి భవిష్యత్తు దృష్ట్యా తెలుగు యువత ఎన్నికల్లోఅనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణ యాదవ్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు అద్దంకి కిట్టు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వినయ్ కుమార్, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు లక్ష్మణ్, తెలుగు యువత సభ్యులు జయప్రకాష్ రామకృష్ణ సిద్ధులయ్య, దిలీప్, మీర్జా, బాలు, భరత్ పాల్గొన్నారు.

మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తి వాయులింగేశ్వర మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. అధ్యక్షుడిగా షాహిర్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జుంలేషా, కోశాధికారిగా హుమయూన్, ఉప కార్యదర్శులుగా శరత్, శంకర్, అరుణ్, పీఆర్‌వోగా ముబారక్, ఏపీ ఆర్‌వోగా షఫీ, సభ్యులుగా వెంకటాద్రి, మోహనకృష్ణ, ఫిరోజ్, వినోద్, శివచంద్ర క్రాంతి ఎన్నికయ్యారు.

అన్నాసామిపల్లిలో రాస్ పశువైద్య శిబిరం

రేణిగుంట, ఫిబ్రవరి22: అన్నాసామిపల్లి గ్రామంలో గురువారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రేణిగుంట ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డాక్టర్ అనూషలు వైద్యపరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు పశుపోషణపై సూచనలు పలు చేశారు. ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, అన్బళగన్, ఇందుమతి, శంకరయ్య, స్వాతి, నాగమణి, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డికి జాస్తి రామయ్య అవార్డు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ కళాకారుడు విశ్వనాథరెడ్డి హైద రా బాదులో గురువారం జాస్తి రామయ్య అవార్డును అందుకున్నారు. తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్ అధ్యక్షులు అనూరాధ బిషోణి ఈ అవార్డును విశ్వనాథరెడ్డికి అందజేశారు. కలంకారీలో విశ్వనాథరెడ్డి చూపుతున్న ప్రతిభను గుర్తించి ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు.. విశ్వనాథరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

ముక్కంటి సేవలో జర్మన్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 : ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునే విదేశీ భక్తులు ఇటీవల పెరుగుతున్నారు. గురువారం ఆరుగురు జర్మనీ మహిళలు శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.ముందుగా ఆలయంలో రూ.500 రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయంలోని పొగడచెట్టు వద్ద కాసేపు శివనామ స్మరణ చేశారు. స్థానిక భక్తులు వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

ముక్కంటి సేవలో భోపాల్ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: ముక్కంటి ఆలయాన్ని గురువారం భోపాల్ అసెంబ్లీ ఎమ్మెల్యే విష్ణు కత్రీజీ దర్శించుకున్నారు. బీజేపీ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు గరికిపాటి రమేష్ బాబు వారికి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.19,500రూ నగదు స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 22: వరదయ్యపాళెం మండలం కంచరపాళెంలో ఇటీవల టీడీపీ నాయకుడు కరుణకుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ దశరథన్, టీడీపీ నాయకులు కరుణయ్య, నాగరాజు, మునివేలు, మణి, కంచరపాళెం యువత పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

తొట్టంబేడు, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ గ్రామంలో రాజేష్, బత్తెయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం సిపాయి భరోసా కింద 40రకాల నిత్యావసర వస్తువులను వారి కుటుంబాలకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి, మధురెడ్డి, వెంకటాద్రి, భాస్కర్, దాము, మూర్తి పాల్గొన్నారు.

మర్రెరెడ్డికి పరామర్శ



తొట్టంబేడు, ఫిబ్రవరి 22: ఒంగోలులో టీడీపీ రాష్ట్ర రైతువిభాగం అధ్యక్షుడు మర్రెరెడ్డి శ్రీనివాసరెడ్డిపై మూడు రోజుల క్రితం దాడి జరిగింది. ఆయన కోలుకుని ఆస్పత్రి నుంచి విజయవాడలోని స్వగృహానికి చేరారు. గురువారం తిరుపతి పార్ల మెంట్ రైతువిభాగం ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌నాయుడు, తొట్టం బేడు మండల అధ్యక్షుడు మురళినాయుడు, నాయకులు ప్రసాద్ నాయుడు, దేవిమోహన్, సురేష్‌నాయుడు, హరి ఆయన్ను పరామర్శించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన సర్పంచ్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 22: మండలంలోని కాంపాళెం తారు రోడ్డుకు సర్పంచ్ మాచాలమ్మ భర్త మునిరాజ మరమ్మతులు చేయించారు. ఆంధ్రజ్యోతిలో 'రెండేళ్లకే లేచిపోయిన తారు రోడ్డు' శీర్షికన ప్రచురితమైన కథనంపై సర్పంచ్ భర్త స్పందించారు. సొంత నిధులతో రెండు చోట్ల గుంతలకు మరమ్మతులు చేయించారు. ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భావితరాల భవిష్యత్తుకు విద్య ముఖ్యం

కేవీబీపురం, ఫిబ్రవరి22: భావితరాల భవిష్యత్తు బాగుపడాలంటే అందరూ విద్యను అభ్యసించి విజ్ఞానం సంపాదించాలని ఆచార్య అజిత్ జీ ఇండియాన్ ది మూవ్ ఫౌండేషన్ చైర్మన్ గురూజీ చెప్పారు. గురువారం మండలంలోని ఆదర్శ, కస్తూర్బ పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు వితరణగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉషోదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల ఉష, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు జయకుమార్, బత్తినయ్య, కళావతి, కమిటీ వైస్ చైర్మన్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.272 చెల్లించాలి


స్వయంగా పనుల్లో పాలుపంచుకున్న కలెక్టర్

రేణిగుంట, ఫిబ్రవరి22: జిల్లాలో ఉపాధి కూలీలకు రోజుకు రూ.272లు చెల్లించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ డ్వామా పీడీని ఆదేశిం చారు. గురువారం రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ పంచాయితీలోని సూరప్పకేశం పరిధిలోని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. స్వయంగా పనుల్లో పాలు పంచుకున్నారు. సకాలంలో కూలి డబ్బులు అందుతోందా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ పనులు జరిగే ప్రాంతాలలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. జాబ్ కార్డులున్న వాందరికీ పనులు కల్పించాల న్నారు. డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ సమా. దానం ఇస్తూ విప్పమాను పట్టెడ పంచాయితీ ప్రహరీ నిర్మాణానికి రూ4.54 లక్షలు మంజూరు చేశామన్నారు. 20 రోజులుగా 34 మంది కూలీలు పనిచేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కూలీలతో కలెక్టర్ ఫొటో తీసుకున్నారు. పర్య వేక్షకులు జయంతి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో
కంప్యూటర్ ఆపరేటర్ మాయాజాలం

- రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మోసం
- న్యాయం కోసం మహిళల వేడుకోలు


విలేకరులతో మాట్లాడుతున్న బాధిత మహిళలు

సత్యవేడు, ఫిబ్రవరి 22: సత్యవేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో తమను మోసం చేశాడని ఇద్దరు మహిళలు ఆరోపించారు. గురువారం వారు సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే.. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన రేష్మ, లలిత. నెలవాయి గ్రామంలో సర్వే నెం.68లో ఇంటి స్థలాలు వారి భర్త పేర్లతో ఉన్నాయి. ఈ క్రమంలో భర్త అన్నాదురై పేరుపై ఉన్న 4 సెంట్ల స్థలంతో పాటు అందులో ఉన్న ఇంటిని తనపై రిజిస్ట్రేషన్ చేయించాలని రేష్మ కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్‌ను సంప్రదించింది. అదేవిధంగా లలిత సైతం భర్త ఉపేంద్ర ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం కంప్యూటర్ ఆపరేటర్‌ను సంప్రదించింది. అయితే వీరిద్దరి ఇంటిస్థలాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలంటే రూ.లక్షా 36 వేలు అవుతుందని రాజశేఖర్ తెలిపాడు. అతడి మాటలు నమ్మి రేష్మ రూ.73వేలు, లలిత రూ.63వేలు చెల్లించారు. రిజిస్ట్రేషన్ పూర్తయింది. పత్రాలు వచ్చాక పరిశీలించగా అన్నాదురై ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనల మేరకు స్టాంపు డ్యూటీ, యూజర్‌చార్జీలు కలిపి రూ.37,440 చలానా రూపంలో బ్యాంకుకు జమైనట్టు ఉంది. అలాగే ఉపేంద్ర ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌కి సంబంధించి రూ.27,930లు జమైంది. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ తమను మోసం చేశారని రేష్మ, లలిత సబ్ రిజిస్ట్రార్ రూపావాణిని ఆశ్రయించారు. అయితే రాజశేఖర్ వంటి ప్రైవేటు వ్యక్తులు ఇక్కడ ఎవరూ పనిచేయడం లేదని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాము అదనంగా చెల్లించిన నగదు ఇప్పించాలని వేడుకున్నారు.

నా భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుంది : ఆదిమూలం


ఆదిమూలాన్ని సన్మానిస్తున్న నాయకులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 22: నా భవి ష్యత్ కార్యాచరణను కాలమే నిర్ణయిస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు, టీడీపీ ఎస్సీసెల్ విభాగ నాయ కులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిం చారు. శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ అందరికీ మంచి చేసిన తనకు దేవుడు మంచే చేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. నీరువాయి టీడీపీ దళిత నాయకులతో మాట్లాడుతూ మీ గ్రామానికి ప్రధాన జాతీయ రహదారి నుంచి విద్యుత్ లైట్లను వేయించానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుణ్ ప్రకాష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కరివర్దన్, స్థానిక నాయకులు నాగరాజు, జార్జ్ విజయన్ పాల్గొన్నారు.

ఐదు రోజులుగా రోడ్డుపైనే..

- ప్రమాదానికి గురై రోడ్డులో ఆగిన బస్సు
- ట్రాఫిక్ అంతరాయం
- పట్టించుకోని పోలీసులు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 22: మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు వెస్ట్‌వరత్తూరు గ్రామ సమీపంలో ఐదు రోజుల క్రితం శ్రీసిటీకి చెందిన ఓ మినీ బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు ముందు భాగం దెబ్బ తింది. ఎదురుగా ఢీకొన్న వాహనం వెళ్లిపోయింది. ఈ బస్సు అలాగే ఉండిపోయింది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రాత్రిపూట వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో ప్రమాదానికి కారణమయ్యేలా ఉంది. నడిరోడ్డులో నిలిచిపోయిన బస్సును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీసిటీ సౌజన్యంతో మరుగుదొడ్లకు మరమ్మతులు



శ్రీసిటీ, ఫిబ్రవరి 22: తడ జడ్పీ హైస్కూలులో మరమ్మతులకు గురైన మరుగుదొడ్లను శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమం కింద రూ.8.5 లక్షల నిధులతో బాగుచేయించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా కంపెనీ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఇకరషి తకావో, బాలుర కోసం నిర్మించిన మరుగుదొడ్ల సముదాయాలను హెచ్ఎం సురేష్ అప్పగించారు. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు కోజి ఒగుమా, యోషిజావా, సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్‌లతో పాటు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ అధికారి సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

19 మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, ఫిబ్రవరి 22: ఏర్పేడు మండలం పల్లంపేట గ్రామానికి చెందిన లోకేష్ అనే వ్యక్తి మద్యం తీసుకెళుతున్న క్రమంలో పంగూరు వద్ద ఏర్పేడు ఎస్ఐ జిలానీ పట్టుకున్నారు. లోకేష్ వద్ద 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

రోగులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22: శ్రీకాళహస్తిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ మౌంట్ బేడన్ పావెల్ 167వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం బాబుగ్రహారం మున్సిపల్ హైస్కూలులో బేడన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడల్ట్ రిసోర్స్ కమిషనర్ ఎం.ఎం. రెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ ప్రపంచంలో 279 దేశాలలో పని చేస్తోందని 79 దేశాలలో ఆయా ప్రభుత్వాలే నడుపుతున్నాయ న్నారు. కార్యాలయ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ రానున్న శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను కోరారు. సహాయ కమిషనర్ పార్వతి, సావిత్రి, యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు ధనుష్, యోగానంద, గైడ్ కెప్టెన్లు జయశ్రీ, సులోచన పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



కేవీబీపురం ఫిబ్రవరి22: మండలంలోని 22 8మంది వలంటీర్లను సన్మానించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరిని సేవా వజ్ర, ఐదుగురిని సేవారత్న, మిగిలిన వారిని సేవామిత్ర అవార్డుతో సన్మానించారు. వైసీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, ఎంపీడీఓ శివప్రసాద్, ఈఓపీఆర్డీ దయసాగర్, నాయకులు జడ్పీటీసీ మునెమ్మ, నందకుమార్, లాల్‌బాబు యాదవ్, వెంకటరత్నం, శాస్త్రి రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తొట్టంబేడు: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. సేవా వజ్ర కింద ఒకరిని, సేవారత్నలుగా ఐదుగురిని, 226 మందిని సేవామిత్రలుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ వర్గానికి చెందిన బృందం వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. జడ్పీటీసీ వర్గం కీళపూడి సచివాలయంలో వలంటీర్లను సన్మానించింది.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా : ఫిబ్రవరి 22: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో, రామానుజా సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు


అరవకొత్తూరులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 22: వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరారు. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం శ్రీకాళహస్తి మండలంలోని అరవకొత్తూరు గ్రామంలో 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముత్తురెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేశారు. వారికి సుధీర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, జడ్పీటీసీలు వెంకట సుబ్బారెడ్డి, తిరుమలయ్య, నాయకులు చెంచయ్యనాయుడు, పాపిరెడ్డి, రమేష్, శివ, గంగాధర్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలం శేషమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వినోద్, సూరిబాబు, బొమ్మయ్య, వెంకటాచలం మాజీ వలంటీర్ బాలమురళి టీడీపీలో చేరారు. వారిని బొజ్జల సుధీర్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, కన్నలి ప్రతాప్ రెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలం కందాడు పంచాయతీలోని సదాశివపురం గ్రామం లో బొజ్జల సుధీర్‌రెడ్డి 'ఇంటింటికీ మీ బొజ్జల ' కార్యక్రమం చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీని యర్ నాయకులు పొన్నారావు, ధనంజ యులునాయుడు, సుబ్రహ్మణ్యం, గురవా రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగరాజునాయుడు, అశ్వద్ధామ, మాధవయ్య, జయప్రకాష్, చిరంజీవులునాయుడు పాల్గొన్నారు.